క్లుప్తంగా

నేడు బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

కమలాపురం : ఈ నెల 22న అయోధ్యలో జరగనున్న రామ మందిర విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక గ్రామ చావిడి నుంచి క్రాస్ రోడ్డు వరకు రామ భక్తుల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ ఏర్పాటు చేసినట్లు రామ భక్తుల సంఘ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. రామ భక్తులు పాల్గొని బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు కార్యకర్తల సమావేశం

వీరపునాయునిపల్లె : కడప నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వీరపునాయునిపల్లె మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రేపు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వేంపల్లి : మండలంలోని 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 22వ తేదీన వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివిజా సంపతి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీన జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 'వేంపల్లి గురించి నా మాటల్లో' అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు తమ పేర్లను 21వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు mpdo. vempalle@gmail.com లేదా 9154560963 నంబరుకు కాల్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం రోజున విద్యార్థులకు కేటగిరీల వారీగా బహుమతులు అందజేస్తామన్నారు.

నేడు చిన్నమాచుపల్లికి ఎమ్మెల్యే రాక

చెన్నూరు : మండలంలోని చిన్నమాచుపల్లెలో ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి దళితవాడ వరకు వేయనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమానికి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి రానున్నట్లు చెన్నూరు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు, ఈ కార్యక్రమానికి చెన్నూరు మండల వైఎస్ఆర్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

గండికోట నుంచి సీబీఆర్‌కు నీరు విడుదల

లింగాల : లింగాల మండలం పార్నపల్లి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు గండికోట రిజర్వాయర్ నుంచి శనివారం నీరు విడుదల చేశారు. రోజుకు 500 క్యూసెక్కుల చొప్పున 40 రోజుల పాటు రెండు టీఎంసీల నీటిని విడుదల చేస్తారని సీబీఆర్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. ప్రస్తుతం సీబీఆర్‌లో ఆరున్నర టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయన్నారు. 40 రోజుల్లో సీబీఆర్‌కు రెండు టీఎంసీల నీరు చేరితే చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ఎనిమిదిన్నర టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని తెలిపారు.

ఓటు వజ్రాయుధం



ర్యాలీలో పాల్గొన్న రెవెన్యూ సిబ్బంది

కమలాపురం : ఓటు వజ్రాయుధం అని, 18ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని మండల తహసీల్దార్ సరస్వతి తెలిపారు.

ఓటు నమోదు పై అవగాహన కల్పిస్తూ శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి పాలకులను ఎన్నుకోవడానికి ఓటు వజ్రాయుధం అన్నారు. ప్రతి ఒక్కరూ హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పోటీ

జమ్మలమడుగు : నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు తొగట వీర క్షత్రియుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల పరీక్ష నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం తొగట వీర క్షత్రియుల సంఘం గురువు దివ్య జ్ఞానానందగిరి స్వాముల సమక్షంలో పరీక్షలను నిర్వహిస్తారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారంతోపాటు, తొగట వీర క్షత్రియ సంఘం పెద్దలను సన్మానిస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షేమం, అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం

జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి



ఆర్టీపీపీ కాలనీలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ప్రతిపక్షాలు ఎన్ని ఆటంకాలు, కుట్రలు కుతంత్రాలు చేసినా, ఎల్లో మీడియా అసత్య ఆరోపణలు, అసత్య కథనాలు ప్రచురించినా ప్రజా సంక్షేమం, అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యమని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఉదయం కలమల్ల గ్రామ పరిధిలోని డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పార్టీ నాయకులు, యూనియన్‌ల నేతలు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా గేటు బయట ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పార్టీ నాయకులతో కలసి ఇంటింటికీ తిరిగారు. ప్రతి ఇంటా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను ఆదేశించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ఏ కుటుంబానికి ఏ మేరకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందో చదివి వినిపించారు.

సీఎం ఆశయాలు నెరవేర్చే బాధ్యత మీదే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చే బాధ్యత మీదేనని సచివాలయ ఉద్యోగులకు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి సూచించారు. సచివాలయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తమ్మిశెట్టి బాలయ్య, ఉప మండలాధ్యక్షుడు పొన్న శ్రీను, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆర్టీపీపీలోని వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఇంజినీర్లు, స్థానిక పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి

చక్రాయపేట: జగనన్న ప్రభుత్వం ప్రతి ఇంటికి అందించిన సంక్షేమ లబ్ధిని వలంటీర్లు, గృహసారథులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలకు వివరించాలని మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన వలంటీర్లు, గృహసారథులు, పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున సంక్షేమ లబ్ధిని మరొక్కమారు ప్రజలకు వివరించాలన్నారు. త్వరలోనే మండలంలో గడప గడపకు కార్యక్రమాన్ని తాను నిర్వహిస్తానని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో పార్టీలతో నిమిత్తం లేకుండా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించారని తెలిపారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం జన్మభూమి కమిటీలు పెట్టి కేవలం ఆ పార్టీకి చెందిన వారికి మాత్రమే లబ్ధి చేకూర్చిందన్నారు. ఇప్పటికే గ్రామాలో దాదాపుగా సమస్యలను పరిష్కరించామని, ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, సర్పంచ్ హర్షద్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, పార్టీ బీసీ నాయకుడు శ్రీనివాసులు, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు గౌస్‌లాజం, దళిత నేతలు బాబు, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపుపై హర్షం



గంగిరెడ్డిపల్లె వద్ద కంప చెట్లను తొలగిస్తున్న దృశ్యం

వీరపునాయునిపల్లె : మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలకు సంబంధించిన రహదారుల్లో ముళ్ల పొదలను తొలగించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి గ్రామాల్లోకి వెళ్లినప్పుడు పొలాల్లోకి వెళ్లాలన్నా, పొలాల్లోని పంటను ఇంటికి చేర్చుకోవాలన్నా చాలా ఇబ్బందులకు గురవుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే కంప చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈమేరకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో గంగిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలో కంప చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఇచ్చిన హామీ మేరకు ముళ్ల పొదలను తొలగించే కార్యక్రమం చేపట్టడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంబేడ్కర్‌పై పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలి



డేనియల్ బాబు

పులివెందుల : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆ పార్టీ నాయకులు దళితులను, దళిత నాయకులను చాలా చులకనగా చూస్తున్నారని, అంబేడ్కర్‌పై పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని పులివెందుల దళిత నాయకుడు డేనియల్ బాబు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడాన్ని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు గొంతు చించుకుంటున్నారన్నారు. చంద్రబాబునాయుడు దళితులకు గానీ, దళిత నాయకులకు గానీ చేసింది ఏమీ లేదన్నారు. అప్పట్లో చంద్రబాబు నాయుడు దళితులుగా ఎవరైనా పుడతారా అని అన్నారని, అదే విధంగా ఇప్పుడు ధూళిపాల నరేంద్ర కూడా అంబేడ్కర్ విగ్రహం తొలగిస్తామని చెప్పడాన్ని బట్టి టీడీపీకి దళితులంటే ఎంత కోపమో అర్థమవుతోందన్నారు. ఇలాంటి పిచ్చి మాటలు మాట్లాడితే దళితులందరూ కలిసి చంద్రబాబు నాయుడును, టీడీపీని నామరూపాలు లేకుండా చేస్తారన్నారు. ఇలాంటి మాటలు వెనక్కి తీసుకుని దళితుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే ధూళిపాల నరేంద్ర ఇంటిని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేట్ డీన్ సుశీల, ఇతర సిబ్బంది

పులివెందుల రూరల్ / లింగాల : యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అరటిలో అధిక దిగుబడులు సాధించవచ్చని అసోసియేట్ డీన్ సుశీల అన్నారు. పులివెందుల ఆహార సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో అరటి కోత అనంతరం మెరుగైన విధి విధానాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల డీన్ ఎంఎస్ బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరటి పంటలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అరటి పంట విలువ పెరుగుతుందన్నారు. సమన్వయకర్త డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ అరటిపంట గ్రేడింగ్, ప్యాకింగ్ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సాయిశ్రీనివాస్, డాక్టర్ జయమ్మ, డాక్టర్ నజ్మా, ప్రవీణ్ రాజశేఖర్, సుబ్బారెడ్డి, రైతులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు గండి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం



కావలి కృష్ణతేజ(ఫైల్)

వేంపల్లి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు పాలక మండలి నూతన చైర్మన్ కావలి కృష్ణతేజ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 20న జరగాల్సిన ప్రమాణ స్వీకారోత్సవం 22కు మార్పు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి హాజరవుతారన్నారు. కావున ప్రతి ఒక్కరు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ భద్రతా వారోత్సవాల పోస్టర్లు విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎస్పీ, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు

పులివెందుల రూరల్ : జాతీయ భద్రతా వారోత్సవాల పోస్టర్లను పులివెందుల డీఎస్పీ వినోద్ కుమార్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.వి.ప్రసాద్ విడుదల చేశారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను, విద్యార్థులను ఆటోలో ఎక్కించుకుని ప్రయాణం చేయరాదన్నారు. అలాగే సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. ద్విచక్ర వాహనాల్లో వెళ్లేటప్పుడు తప్పనిసరిగా వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగంగా ప్రయాణించడం చాలా ప్రమాదకరమన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల నేపథ్యంలో పులివెందుల పట్టణంలోని కళాశాలలు, పాఠశాలల విద్యార్థులతో పాటు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల ఎలాంటి ప్రమాదాలు జరుగవన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఆర్టీసీ డీఎం రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ హాజీవలి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ రాత పరీక్షలు

జమ్మలమడుగు: నవోదయ రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం ఉదయం మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు మండలాలకు చెందిన విద్యార్థులకు ఆరో తరగతిలో అడ్మిషన్‌ల కోసం విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు.

బాలాజీ ఉన్నత పాఠశాలలో 192 మంది విద్యార్థులకు 105 మంది, సెయింట్ మేరీస్‌లో 192 మందికి 118 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ పరమేశ్వరయ్య తెలిపారు. మొత్తం 384 మంది హాజరు కావాల్సి ఉండగా 223 మంది మాత్రమే హాజరు కాగా 161 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్ : ఉరుసు మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పీఠాధిపతి ముఫ్తి సయ్యద్ షా భక్యారుద్దీన్ ఖాదిరి నిజామి పేర్కొన్నారు. కడప అల్మాస్‌పేటలోని సిరాజుల్ మదరసాలో ఈ నెల 27వ తేదీ హజరత్ సయ్యద్ షా సర్ మత్ కదిరి రహమతుల్లా హి అలే వారి ఉరుసుకు సంబంధించిన పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాహీర్ తారిఖలి, సబ్జాన్, షఫీఖాన్, ఖాదర్‌ఖాదిరి శిష్య బృందం పాల్గొన్నారు.

మట్కా బీటర్లు అరెస్ట్

కడప అర్బన్ : కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ పి. నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ మహమ్మద్ రఫీ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ప్రకాష్‌నగర్‌లో శనివారం సాయంత్రం మట్కా రాస్తున్న డి. మస్తాన్, కె. రమేష్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 38,230 నగదును, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో బైకు ర్యాలీ



బైకుర్యాలీ నిర్వహిస్తున్న రామభక్తులు

సింహాద్రిపురం : ఈ నెల 22వ తేదీ సోమవారం అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకుని శనివారం సంఘీభావంగా నిదిగల ఆంజనేయస్వామి దేవాలయం నుంచి సింహాద్రిపురం పురవీధుల గుండా రామభక్తులు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శశిభూషణరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, వీరభాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చక్రాయపేట: మండలంలోని కె.రాజుపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తక్కళ్ల పల్లె ఫీడర్‌లో ఆదివారం విద్యుత్ సరఫరాను కొంత సమయంపాటు నిలిపివేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు 24 గంటల విద్యుత్ సరఫరా ఇచ్చే నిమిత్తం నూతన లైన్ ఏర్పాటు చేస్తున్నందున మధ్యాహ్నం 1–30 నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతి చెందిన పార్వతి

పెండ్లిమర్రి : మండలంలోని కోరవాండ్లపల్లెలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... కోరవాండ్లపల్లె బీసీ కాలనీకి చెందిన మేకల పార్వతి(42) చామంతి పూల కోతకు వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా.. బస్ సాప్ సమీపంలో బొలేరో క్యాంపర్(మినీ వాహనం) ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు.

ఉచిత శిక్షణ, ఉపాధి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఎస్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వివిధ వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని శృతి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంటర్ హెడ్ జిలాన్ ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ కెమెరా రిపేరు, సర్వీసింగ్, అలాగే కంప్యూటర్ రిపేర్, సర్వీసింగ్‌కు పదవ తరగతి ఉత్తీర్ణులైన వారికి రెండు నెలలపాటు శిక్షణ ఇస్తామన్నారు. 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు కడప నగరం కో ఆపరేటివ్ కాలనీలోగల తమ శిక్షణా కేంద్రానికి విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో రావాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 99089 74770, 63053 84805 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

29న కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వ పాఠశాలలలో పనిచేసే స్వీపర్లకు కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని 29న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపడుతున్న ఆందోళనను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా పేర్కొన్నారు. శనివారం నగరంలోని హోటల్ వివేకాస్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే స్వీపర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో మరుగుదొడ్లు శుభ్రం చేసేవారికి ఇప్పుడిస్తున్న రూ. 6వేలు వేతనం పెంచాలన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఎస్.భార్గవి

జమ్మలమడుగు రూరల్ : ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగినులపై వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలకు గురవుతారని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి ఎస్. భార్గవి పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు చాంబర్‌లో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు పి.ఓ.ఎస్.హెచ్ 2013 చట్టంపై లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను సహచర ఉద్యోగులు అవమానంగా మాట్లాడినా, లైంగికంగా వేధించినా తమకు ఫిర్యాదు చేయాలన్నారు. వివరాలకు 08560-270811, 08560-270003 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని పాటించాలి



ఎర్రగుంట్ల: పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ ఈశ్వరయ్య

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరూ మత సామరస్యాన్ని పాటించాలని ఎర్రగుంట్ల పట్టణ సీఐ ఈశ్వరయ్య తెలిపారు. శనివారం సాయంత్రం ఎర్రగుంట్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభం సందర్భంగా జరుగుతున్న కార్యక్రమాలను ప్రశాంతంగా జరిగే విధంగా అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఎవరైనా ప్రశాంతతకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ క్రిష్ణంరాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించాలి



జమ్మలమడుగు:శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

జమ్మలమడుగు : అందరు కలిసికట్టుగా ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని అర్బన్ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు. శనివారం అర్బన్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వతేదీన అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా స్థానికంగా ఉన్న రామాలయాలలో కూడా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. పట్టణంలోని హిందూ ముస్లింలు ఎలాంటి సమస్యలను సృష్టించకుండా శాంతియుతంగా ఉండాలన్నారు.

శాంతియుతంగా మెలగాలి



సింహాద్రిపురం:మత పెద్దలతో మాట్లాడుతున్న ఏఎస్ఐ

సింహాద్రిపురం : అందరూ కలిసికట్టుగా శాంతియుతంగా మెలగాలని ఏఎస్ఐ హాజీబాషా పేర్కొన్నారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22వ తేదీన జరిగే అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు పాల్గొన్నారు.

కౌన్సిలర్ కుటుంబానికి రూ.50 వేలు సాయం



సాయం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు కౌన్సిలర్ డి.వెంకటలక్షుమ్మ భర్త డి.వెంకటేశుకు రూ.50 వేలు నగదును ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి సాయం అందించారు. ఇటీవల వెంకటేశు అనారోగ్యంతో కాలుకు ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్దనే ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ కుటుంబానికి రూ.50 వేలు నగదును సాయంగా అందించారు. ఈ మొత్తాన్ని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి కౌన్సిలర్ ఇంటి వద్దకే వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు డి.సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు రాజారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.